ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నాయకుల ఘన స్వాగతం

చిట్యాలలో ఎమ్మెల్సీ కవితకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ రామన్నపేట మండల నాయకులు

రామన్నపేట, ఫిబ్రవరి 15 : ఖమ్మం పర్యటనకు వెళ్తున్న జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రామన్నపేట మండల నాయకులు శనివారం చిట్యాలలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమారమేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, నాయకులు సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్‌బాబు, గొరిగే నర్సింహ, పున్న వెంకటేశం, కోళ్ల స్వామి, చాంద్, మత్తయ్య, సంతోష్, మల్లేశం, విక్రం, శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, అల్లయ్య పాల్గొన్నారు.

23న బంగారు విమాన గోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ

మాట్లాడుతున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్య విమాన గోపురం మహాకుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవాలను ఈ నెల 19నుంచి 23వరకు కొనసాగుతాయని ఆలయ ఈఓ భాస్కర్‌రావు శనివారం వెల్లడించారు. స్వస్తీ వాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనంతో మొదలై చివరి రోజు 23న ఉదయం 11:54 గంటలకు సుదర్శన లక్ష్మీనారసింహ దివ్య స్వర్ణ విమానగోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠా మహోత్సవం చేపట్టి స్వర్ణగోపురాన్ని స్వామివారికి అంకితమివ్వనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఆస్థాన మండపంలో శాంతి కల్యాణం చేపట్టనున్నట్లు చెప్పారు. 5రోజులపాటు జరిగే ఈ వేడుకలను పరివ్రాజకాచార్య శ్రీమద్ వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య వానమామలై మఠం 31వ పీఠాధిపతులు, మధుర కవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణ, మంగళాశాసనాలతో చేపట్టనున్నారు. 108 మంది రుత్వికులతో నారసింహస్వామి మూర్తి మంత్ర, స్తోత్రం, వేదాలతోపాటు రామాయణం, భారత ఇతిహాసాల పఠనం కొనసాగించనున్నారు. బంగారు తాపడం పనులు పూర్తయ్యాయని, ఇందుకోసం 65కిలోల 84 గ్రాముల బంగారం వినియోగించామని చెప్పారు. ఇందులో 10కిలోల 80 గ్రాముల బంగారం విరాళం రాగా, దేవస్థాన బంగారం బాండ్లకు సంబంధించిన నిధులతో 3 కిలోల 180 గ్రాములు, స్వామి వారి హుండీలోకి సమకూరిన మిశ్రమ బంగారం నుంచి సేకరించిన 12 కిలోల 701 గ్రాముల బంగారం వినియోగించామన్నారు. మరో మిశ్రమ వెండిని మార్చి 8కిలోల 650 గ్రాముల బంగారంతోపాటు 30కిలోల 50 గ్రాములు బంగారాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. 5 అంతస్తుల పంచతల గోపురాన్ని 50 ఏండ్లు మన్నిక కలిగేలా స్వర్ణతాపడం పనులు జరిగాయని చెప్పారు. ఇది దేశంలోనే అతిపెద్ద స్వర్ణమయమైన దివ్య విమానగోపురం అన్నారు. ఆలయంలోని విమాన గోపురంతోపాటు చుట్టూ రాజగోపురాలకు కలిగిన 39 రాగి కలశాలను సైతం బంగారు తాపడంతో తీర్చిదిద్దామని తెలిపారు. ఇందులో భాగంగా పంచ కుండాత్మక మహాయాగం నిర్వహణకు ప్రధానాలయ ఉత్తర మాఢవీధుల్లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొండపైన మాఢవీధులు, కొండ కింద వైకుంఠ ద్వారం, బస్టాండ్, వ్రత మండపాలలో ఎల్ సీడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశోధనాత్మక ప్రాజెక్టులకు ఐసీఎస్ఎస్ఆర్ ఆర్థిక తోడ్పాటు

సదస్సులో కాన్ఫరెన్స్ ప్రాస్పెక్ట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 15 : పరిశోధనాత్మక ప్రాజెక్టులకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక తోడ్పాటు అందిస్తుందని ఆ సంస్థ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల విజ్ఞాన్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో 'యువతలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు' అంశంపై శనివారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం విద్యా సంస్థలు కేవలం కంటెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్‌లుగానే ఉన్నాయన్నారు. అలా కాకుండా కంటెంట్ జనరేటర్లుగా విద్యాసంస్థలు మారాలని సూచించారు. యూనివర్సిటీ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ సమాజానికి దోహదపడే అంశం మీద నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నిధులు సమకూర్చినందుకు ఐసీఎస్ఎస్ఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు 150 మంది పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ సైకాలజీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ హెడ్ పద్మజ, డీన్ కల్పనా కోనేరు, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ సరిత సత్పతి, కాన్ఫరెన్స్ కన్వీనర్ సురేశ్‌చంద్ర, ప్రొఫెసర్లు సయ్యద్, అమీనా, లాల్, ఒకామా పాల్గొన్నారు.

త్రిఫ్ట్ పథకానికి 3,176 దరఖాస్తులు : డీఓ

దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఓ శ్రీనివాసరావు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 15 : త్రిఫ్ట్ పథకానికి దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసిందని, ఇప్పటి వరకు 3,176 దరఖాస్తులు వచ్చాయని జిల్లా చేనేత జౌళి శాఖ డీఓ, చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో శనివారం చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఆయన వెంట చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు ఉన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

- మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్

మోత్కూరు, ఫిబ్రవరి 15 : తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ తమ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాపిస్తున్న వ్యాధుల నివారణ కోసం ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో పారిశుధ్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది హన్మకొండ నర్సింహాచారి ఉన్నారు.

సంత్ సేవాలాల్ ఆశయాలను సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 : సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామ పరిధిలోని దేవనాయకుల మర్రిలో శనివారం జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జీవిత చరిత్రను అందరూ చదివే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆర్థికంగా ఎదుగాలంటే ఎలాంటి చెడు వ్యసనాలకు గురికావద్దని, మంచి మార్గంలో నడువాలని సూచించారు. సంత్ సేవాలాల్ బంజారా కులస్తులకే కాకుండా యావత్ జాతికి మార్గదర్శకమని అన్నారు. కటిక పేద స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదుగాలంటే తరతరాలు మార్చేది చదువు ఒక్కటేనని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. బంజారాల కోరిక మేరకు భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని పరిశీలించాలని తాసీల్దార్‌కు సూచించారు. భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా, ఎంపీడీఓ నవీన్‌కుమార్, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సేవాలాల్ జయంతి

భువనగిరి అర్బన్ : సంత్ సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారన్నారు. హైదరాబాద్‌లో బంజారా భవనం నిర్మించారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని గుండ్లగూడెంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు.

బొమ్మలరామారం : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా మండలంలోని చీకటిమామిడి గ్రామం నుంచి తిరుమలనాథస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భోగ్ బండార్ పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ధీరావత్ శంకర్, ధీరావత్ రాజన్‌నాయక్, శ్రీహరి నాయక్, లింగానాయక్, బాలూనాయక్, గుండు నాయక్, పాచ్యానాయక్ పాల్గొన్నారు.

గీత వృత్తికే వన్నె తెచ్చిన నాయకుడు ధర్మభిక్షం

- సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

సంస్థాన్ నారాయణపురం : ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 15 : గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి, గీత వృత్తికే వన్నె తెచ్చిన నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. పట్టణంలోని గౌడ సంఘం ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతిలో ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ధర్మభిక్షం చేసిన పోరాటాలను ఆయన కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం 5 సంవత్సరాలు జైల్లో ఉండి విద్యార్థి ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయుడని కొనియాడారు. ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని గీత కార్మికులకు పిలుపునిచ్చారు. అంతకు ముందు గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం విగ్రహానికి నివాళి అర్పించారు.

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల నివాళి

సంస్థాన్ నారాయణపురం : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలేరు టౌన్ : ధర్మభిక్షం జయంతిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

తుర్కపల్లి మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతోపాటు కూరెళ్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. చౌటుప్పల్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో, యాదగిరిగుట్ట పట్టణంలోని గుండ్లపల్లి కల్లుగీత సహకార సంఘం కార్యాలయంలో, బొమ్మలరామారం మండల కేంద్రంలో ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. భూదాన్ పోచంపల్లి పట్టణంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం భవనంలో, రామన్నపేటలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్మభిక్షం చిత్రపటాలకు నివాళులర్పించారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో మంటలు

చౌటుప్పల్ ఫారెస్ట్‌లో అంటుకున్న మంటలు

చౌటుప్పల్, ఫిబ్రవరి 15 : పట్టణంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో శనివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆటవీ ప్రాంతంలోని కొన్ని చెట్లు కాలిబూడిదయ్యాయి. గడ్డికి నిప్పు పెట్టడంతో ఈ మంటలు చెలరేగినట్లు సంబంధిత అధికారులు భావిస్తున్నారు. ఫారెస్ట్ అధికారుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలతో అక్కడ ఉన్న కోతులు రోడ్లపైకి పరుగులు తీశాయి.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

సిద్ధులు (ఫైల్)

రాజాపేట, ఫిబ్రవరి 15 : మండలంలోని నెమిలె గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన పాల సిద్ధులు (30) కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

అంతర్రాష్ట్ర మహిళా నిందితుల అరెస్టు

కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15 : రద్దీ ప్రదేశాల్లో దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర మహిళా నేరస్తులను అరెస్టు చేసినట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. భువనగిరిలోని డీసీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 11న భువనగిరి బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ఓ మహిళ బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆమె వెంటనే పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భువనగిరి పట్టణ పోలీసులు కేసు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం భువనగిరి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడ జిల్లా రామవరపుపాడుకు చెందిన గన్నికోట దుర్గ, నక్క మంగ, పశ్చిమ గోదావరి జిల్లా చింతలకోటి గురువుకు చెందిన గండికోట లక్ష్మిగా గుర్తించారు. వారిని విచారణ చేయగా.. నేరానికి పాల్పడినట్లు ఒప్పుకొన్నారు. వారి వద్ద నుంచి 3లక్షలా 40వేల విలువైన బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి నక్క మోహన్ పరారీలో ఉన్నాడు.

దుర్గ, మంగ, లక్ష్మి, మోహన్ ముఠాగా ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక చోట్ల రద్దీగా ఉండే ప్రదేశాల్లో చోరీలకు పాల్పడినట్లు డీసీపీ తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా వీరి వెంట చిన్న పిల్లలను వెంట తీసుకెళ్లేవారు. ఈ నెల 10న తొర్రూరు ఎస్బీఐ వద్ద ఓ మహిళ కవర్‌లో డబ్బులు పెట్టుకొని బ్యాంకులోకి వెళ్తుండగా.. ఆమె వద్ద నుంచి రూ.40వేలు దొంగతనం చేశారు. ఈ నెల 11న భువనగిరి బస్టాండ్‌లో బస్సు కోసం ఓ మహిళ తన పిల్లలతో కలిసి వేచిఉండగా.. ఆమె పర్సును, బట్టల బ్యాగ్ నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదును దొంగిలించారు. ఈ నెల 13న కోరుట్ల బస్టాండ్‌లో ఓ మహిళ బట్టల బ్యాగు పట్టుకొని బస్సు ఎక్కుతుండగా.. 3తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. శుక్రవారం ఈ నలుగురు నిందితులు భువనగిరిలో దొంగతనం చేద్దామని కారులో వచ్చారు. కారును మోహన్ బస్టాండ్ బయట ఆపుకొని ఉండగా.. లోపలికి వచ్చిన ముగ్గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో మోహన్ కారును వదిలిపెట్టి పారిపోయాడు. వీరు గతంలో విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, కృష్ణా, తూర్పు గోదావరి, కడప, ప్రకాశం, తిరుపతి, మహబూబాబాద్, జగిత్యాల, గాజువాక జిల్లాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లినట్లు డీసీపీ తెలిపారు. భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కుమార్, ఎస్ఐ కుమారస్వామి, సిబ్బందిని అభినందించారు.

'20న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి'

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పట్టణంలో శనివారం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 420 వాగ్దానాలు చేసి 14 నెలలు గడుస్తున్నా ఒక్కటీ అమలు కాలేదన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి గ్రామసభలు, సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, గిరిజనులకు పోడు భూముల హక్కు పత్రాలు చట్టబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల నాయకుడు పగడాల శివ, పీవైఎల్ నాయకులు పోతగల నరసింహ, పగిడిమర్రి ప్రవీణ్, రంజిత్, రవికుమార్, లాల్, వినయ్, రాజేశ్ ప్రసాద్, హరివర్ధన్, ధనరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోత్కూరులో రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 15 : అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను విడుతల వారీగా అందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. పథకాల కోసం ఇప్పటికే గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించామని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విమల, మాజీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నగేశ్ పాల్గొన్నారు.

బిక్కేరు వాగు ప్రవాహం పరిశీలన

మోత్కూరు : బిక్కేరు వాగులో ప్రవహిస్తున్న గోదావరి జలాల ప్రవాహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగిలో వరి పంటలు ఎండిపోకుండా గంధమల్ల నుంచి ఆలేరు, గుండాల, మోత్కూరు మీదుగా బిక్కేరులోకి నీటిని విడుదల చేశామన్నారు. యాసంగి వరి పంట చేతికి వచ్చే వరకు గోదావరి జలాలు వస్తాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రైతులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 15 : ఎమ్మెల్సీ ఎన్నికలు వ్యక్తుల మధ్య జరుగడం లేదని, బడుగుల ఆత్మగౌరవానికి, ఆధిపత్య కులాల రాజకీయ అధికారానికి మధ్య జరుగుతున్నవని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌కు బీసీ ఉపాధ్యాయ, ఉద్యోగులంతా మద్దతు పలికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో 43 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ ఎన్నికల్లో మరో రెడ్డిని గెలిపించి 44 మందిని చేయడం సరికాదని అన్నారు. 60 శాతం ఉన్న బీసీలు 19మంది మాత్రమే ఉన్నారని, బీసీలను గెలిపించి చట్టసభల్లో బీసీల వాణి వినిపించేలా బీసీ సమాజం ఆలోచన చేయాలని సూచించారు. పిడికేడు శాతం ఉన్న వారికి పదవులు ఇచ్చి 60శాతం ఉన్న బీసీలను అణగదొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్, బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ల కార్తీక్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, లింగస్వామి, నవీన్, భాస్కర్, యాదగిరి పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేత

నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15 : జిల్లాలో డీఎస్సీ-2008లో అర్హత సాధించిన అభ్యర్థులకు శనివారం డీఈఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌కు హాజరైన 24 మందికి పాఠశాలలను కేటాయించారు. అనంతరం వారికి డీఈఓ సత్యనారాయణ నియామక ఉత్తర్వు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిలింగ్‌కు హాజరు కాని ఆరుగురు అభ్యర్థులకు పోస్ట్ ద్వారా నియామక ఉత్తర్వు పత్రాలు పంపుతామన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈ నెల 17న కేటాయించబడిన మండలంలోని ఎంఈఓలకు రిపోర్టు చేసి విధుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ ప్రశాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాండునాయక్, సత్యనారాయణరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రీతిస్వరూప్

రాజాపేట, ఫిబ్రవరి 15 : విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని జిల్లా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రీతిస్వరూప్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల వల్ల కలిగే ఒత్తిడిని జయించడంతోపాటు నివారణకు తీసుకోవలసిన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్య అధికారి ప్రవీణ్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయంపై రైతులకు అవగాహన